క్లుప్తంగా

ప్రమాదకరంగా పైప్‌లైన్ గొయ్యి



రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక రోడ్డులో ప్రమాదకరంగా గొయ్యి

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక రిలయన్స్ బంకు వెనుక రోడ్డులో పైపులైన్ గొయ్యి తవ్వి, మరమ్మతు పనులు పూర్తి చేశారు. ఆ గొయ్యి పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. గొయ్యి మట్టి రోడ్డుకు మధ్యలోకి వచ్చేయడంతో ఈ రోడ్డులో నాలుగు చక్రాల వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. వర్షాలు పడినప్పుడు ఈ గొయ్యి పూర్తిగా నీటమునిగుతుంది. ఈ గొయ్యి వల్ల ఈ రోడ్డులో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన గానామృతం

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలోని ఉపాలయం విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో గణపతి నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం గోపవరం శ్రీరామ మందిరానికి చెందిన శ్రీ రామ భక్త భజన మండలి బృందం 70 మంది మహిళలు వెంకటేశ్వర గానామృతాన్ని ఆలపించారు. శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

అడ్డుకట్ట తొలగింపు



పెదఅమీరంలో సమస్యాత్మకంగా ఉన్న అడ్డుకట్టను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

కాళ్ల: అధికారులు స్పందించారు. అడ్డుకట్టను తొలగించారు. పంట కాలువలోని ముంపు నీరు మురుగు కాలువలోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేశారంటూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుపై మండల స్థాయి అధికారులు స్పందించారు. సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించి, జేసీబీ సహాయంతో అడ్డుకట్టను మంగళవారం తొలగించారు. ఈనెల 3న సాక్షిలో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అడ్డుకట్ట తొలగించడం వల్ల ఎగువన ఉన్న రైతులకు మేలు జరిగిందని రైతు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ వారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. ఆలయ ఆవరణలో నిర్వహించే లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ముందుగా తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని మంగళవారం కోరారు.

విద్యాసామగ్రి అందజేత



విద్యార్థులకు ఐడీ కార్డులు అందిస్తున్న దాత

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో విద్యాసామగ్రి అందజేస్తున్నామని దాత వంకదార వేణు అన్నారు. మంగళవారం స్థానిక పెదగరువు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఐడీ కార్డు, టై, ర్యాంక్ కార్డులతో పాటు విద్యాసామగ్రిని అందించారు. వేణు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేయాలని ఒక లక్ష్యం పెట్టుకున్నానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నిల్లా సురేష్ బాబు, ఉపాధ్యాయులు పి.లక్ష్మీనారాయణ, సీఆర్ఎంటీ బీపీ వినయలత, అంగన్‌డీ కార్యకర్త జి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

జీఓ115 రద్దు చేయాలి

నరసాపురం: జీఓ–115 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నరసాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి గేట్ వద్ద నర్సులు ఆందోళన చేశారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ స్ట్రగుల్ కమిటీ, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ స్ట్రగుల్ కమిటీ అధ్యక్షురాలు సీహెచ్ చిట్టితల్లి మాట్లాడుతూ జీఓ–115 ద్వారా ప్రభుత్వం ఎవరైతే ఏఎన్ఎంలుగా ఉండి ఇంటెన్సిఫైడ్ శిక్షణ తీసుకున్నారో వారిని స్టాఫ్ నర్స్‌లుగా నియమించాలని నిర్ణయించతగదన్నారు. వెంటనే జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో రద్దు చేసే వరకూ దశలవారీగా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.పవిత్ర, ఎం.సుష్మి, ఆర్ విమల, హెల్త్ కౌన్సిలర్ జేసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగైన పంట బోదెలు

- ఆక్రమించినా అడిగే వారేరీ?
- ఉండి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మురుగు, పంట బోదెలు అన్యాక్రాంతం
- భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం



ఉండిలో పంట బోదెను ఆక్రమించి దడి ఏర్పాటు చేసిన దృశ్యం



ఉండిలో పంట బోదెను ఆక్రమించడంతో రోడ్డుపైనే వర్షపునీరు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండితో సహా పలు గ్రామాల్లో ముఖ్యంగా మేజర్ పంచాయతీల్లోని మురుగు బోదెలు, పంట బోదెలు మాయమయ్యాయి. దీనికి కారణం కొందరు స్వార్థపరుల భూకాంక్ష అని పలువురు విమర్శిస్తున్నారు. ఆక్రమించిన స్థలాల్లో అక్రమంగా అనుమతులు లేకుండా పూడికలు చేసి వాటిలో భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. ఆ పంట పొలాల వద్ద ఉండే పంట బోదెలు వాటికి సంబంధించిన మురుగు బోదెలను సంబంధిత వ్యక్తులు ఆక్రమించుకున్న కొందరు వాటిని విక్రయించారు. ముఖ్యంగా ఉండి గణపవరం రోడ్డులో ఉండి పెద్ద పంట బోదె ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. అధికారులు రోడ్డు పక్కన ఉండే చిరువ్యాపారులు, నిరుపేదల ఇళ్లపై ప్రతాపం చూపించారు గాని పంట బోదెను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోలేక పోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆక్రమణలతో వరిచేలు, రోడ్లు ముంపునకు గురి

ఉండితో పాటు పలు గ్రామాల్లో మురుగు పంట బోదెలు ఆక్రమణకు గురికావడంతో భారీ వర్షాలప్పుడే కాకుండా స్వల్పంగా వర్షం కురిసినా వరిచేలల్లో నీరు నిలుస్తోంది. కొద్దిపాటి వర్షాలకే పంటలు మునిగి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు అన్నారు. ప్రతి ప్రాంతంలో పలు ప్రాంతాల్లోని రోడ్లు జలమయం అవుతున్నాయి. ముంపునకు ప్రధాన కారణం ఆక్రమణలేనని అని పలువురు అంటున్నారు. పలు గ్రామాల్లో పంట బోదెలను ఆక్రమించుకుని అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వకం చేయడం కూడా ముంపునకు ఓ కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని ఓ గ్రామంలో పూర్తి స్థాయిలో అక్రమ ఆక్వా చెరువులు ఉండటంతో ఆ గ్రామంలోని అన్ని పంట, మురుగు బోదెలను సదరు వ్యక్తులు ఆక్రమించుకున్నారు. ఎంతటి భారీ వర్షాలు వచ్చినా ముంపు సమస్య రాకుండా పంట బోదెలు, మురుగు బోదెలు ఎంతో ఉపయోగపడేవి కానీ ప్రస్తుతం వాటిని ఆక్రమించుకుని స్థలాలుగా మార్చేయడం వర్షం నీరు బయటకు వెళ్లే అవకాశం లేక పలువురు రైతులు, ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పంట, మురుగు బోదెలను వెలికితీయాలి

గతంలో ప్రతి ప్రాంతంలోని వరిచేలకు ఒకవైపు పంట బోదె, మరోవైపు మురుగుబోదెలు ఉండేవి. రానురాను అవన్నీ మాయమైపోయాయి. ఇప్పుడు వాటిని వెలికితీస్తే వరిచేలు, గ్రామాల ముంపు సమస్య తీరే అవకాశం ఉందంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి బోదెలను వెలికితీసే పని చేపడితే అటు రైతులకు, ప్రజలకు ఇటు ప్రభుత్వానికి మంచి జరుగుతుందనే అభిప్రాయం వెలువడుతుంది.

ప్రవాహానికి అంతరాయం ఉండకూడదు



ఎంత భారీ వర్షం కురిసా గాని వర్షపు నీరు బయటకు వెళ్ళేందుకు ఎన్నో సదుపాయాలు వుండేవి.ఇప్పుడు కొద్దిపాటి వర్షం కురిస్తే నీరు బయటకు వెళ్ళక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.ఊరు ఎంత అభివృద్ధి చెందినా అంతకు ముందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రెయినేజ్ వ్యవస్థ అలాగే ఉంటుంది కదా.మరి ఇప్పుడు అవన్నీ ఎందుకు లేవు.ఏమైపోయాయి.

– బొడ్డు నాగన్న, చెరుకువాడ

అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ భూములైన మురుగు, పంట బోదెలు అనేవి ప్రభుత్వానివి.రైతు పొలం ఎన్నిసార్లు అమ్మినా అభివృద్ధి చేసుకున్నా పంట, మురుగు బోదెలు రైతులవి లేదా కొనుగోలు చేసిన వ్యక్తికి చెందవు. బోదెలు ఉండటం వల్ల ఎంతటి వరద ముప్పు వచ్చినా నీరు బయటకు వెళ్లే అవకాశం ఉంటుంది. బోదెలు మాయమవడం చాలా దారుణం.దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వెలగపల్లి టోనీ, యండగండి

రోడ్లు ధ్వంసం అవుతున్నాయి



నా చిన్నతనంలో జాతీయ, రాష్ట్ర, పంచాయతీ రాజ్, జెడ్పీ ఇలా ఏ విధమైన రోడ్డు చూసినా తప్పకుండా పంట బోదెలు ఉండేవి. ఇప్పుడు రోడ్డును ఆనుకుని ఇరువైపులా ఇళ్ల స్థలాలు, ఆక్రమణలే ఉంటున్నాయి.గతంలో వర్షం వస్తే సంబంధిత బోదెల ద్వారా వర్షం నీరు బయటకు వెళ్లేది. ఇప్పుడు వర్షపు నీరు రోడ్లపైనా ఉండటంతో రోడ్లు ధ్వంసమై ప్రమాదాలు జరుగుతున్నాయి.

– పారుపూని రాహుల్, ఎన్నార్పీ అగ్రహారం

భీమవరంలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం

విజృంభిస్తున్న దోమలు



మెంటేవారితోట రైల్వే అండర్ టన్నెల్ వద్ద వర్షపు నీరు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ లేదు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. దీంతో ప్రజలు దోమల వల్ల ఏ రోగం వస్తుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం పట్టణ వీధులు వర్షం నీరు బయటకెళ్ళ్లన తర్వాత వీధి రోడ్లు బురదమయంగా, డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు గత పదిరోజులుగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫాగింగ్ ఒక వార్డులో చేసి మరో ఒక వార్డులో చేయడం లేదు. కొన్నిచోట్ల వీధిరోడ్లపై ఇప్పటికీ నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వారు కోరారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన



డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్

భీమవరం: క్షణికావేశంలో నిండుజీవితాన్ని ఆత్మహత్యప్రయత్నంతో బలిచేయకూడదని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.శంకర్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఏటా ఆత్మహత్యల పేరుతో సుమారు 9 వేల మంది మరణిస్తున్నారని, ఇందులో యువత సంఖ్య ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ వీకేజీ ప్రసూన మాట్లాడుతూ యువత సరైన జీవన దృక్పథాన్ని అలవర్చుకుని, జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించాలని సూచించారు. అనంతరం ఆత్మహత్యలను నివారిస్తామంటూ విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.రాజశేఖర్, జి.ఉమామహేశ్వరి, డి.సత్యనారాయణ, పి.అమూల్యరావు, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లక్ష్మీకాంతం

భీమవరం అర్బన్: తల్లులు ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని భీమవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మంగళవారం భీమవరంలోని గూట్లపాడు అంగన్‌వాడీ కేంద్ర కార్యాలయంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. కిషోర బాలికలు నుంచి బాలింతలు వరకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకుంటూ తద్వారా వచ్చిన ఫలితాలు ఆధారంగా ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆకు కూరలు, కూరగాయలు, పప్పు దినుసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.అనిల్‌కుమారి, ఏడబ్ల్యూడబ్ల్యూస్ మేరీ, ప్రసన్న, రాజేశ్వరి, సత్య హరిణి, హెల్త్ స్టాఫ్, గర్భిణులు, తల్లులు, ఐసీపీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల ఆపన్న హస్తం



కాళ్ల తహసీల్దార్ కార్యాలయం నుంచి పాలు, బిస్కెట్లు, బ్రెడ్ ప్యాకెట్లు తరలిస్తున్న దృశ్యం



తహసీల్దార్ కార్యాలయంలో వరద బాధితులకు పంపించేందుకు సిద్ధంగా ఉన్న వాటర్ బాటిళ్లు

కాళ్ల: విజయవాడలోని వరద బాధితులకు ఆపన్న హస్తం అందించేందుకు కాళ్ల మండలంలో దాతలు ముందుకు వచ్చారని ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున తెలిపారు. మంగళవారం వరద బాధితులకు దాతల సహకారంతో పాలు, బిస్కెట్, బ్రెడ్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు వరద బాధితులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ప్రత్యేక వాహనాలు వీటిని పంపించారు. కాళ్లలో ఆక్వా షాపుల యజమానులు సాయమందించేందుకు ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన వ్యాపారులు నారేన శ్రీనివాసు, కోరా రామమూర్తి నిమ్మల తాతాపండు, గోళ్ల నాగేశ్వరరావు, పోతన దుర్గాఫణి, కొల్లి శివ నాగరాజు రూ.30,000 డీడీని కాళ్ల తహసీల్దార్ నాగార్జున వారి ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కి అందజేసారు.

విద్యార్థుల నిజాయతీకి అభినందనలు



దుంపగడపలో సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు

ఆకివీడు: నీతి వాఖ్యాలు చదవడమే కాదు వాటిని ఆచరించినప్పుడే ఉపాధ్యాయుల బోధనకు సార్థకత ఏర్పడుతుందని ముగ్గురు విద్యార్థులు నిరూపించారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు యర్రా పవన్, తిరుమాని జయ కృష్ణ, సాయిరాంలు భోజన విరామ సమయంలో తిరిగి క్లాసుకు వెళుతున్న తరుణంలో రోడ్డుపై స్మార్ట్ ఫోన్ మంగళవారం దొరికింది. దానిని జేబులో పెట్టుకోకుండా నిజాయతీగా తమ ఉపాధ్యాయుడు పెంకి విజయ్ కుమార్‌కు అప్పగించారు. ఫోన్ యజమాని వివరాలను ఉపాధ్యాయుడు ఆరా తీయగా వడ్రంగి పనిచేస్తున్న మోపిదేవి శ్రీను అనే వ్యక్తికి చెందినదని తెలుసుకున్నారు. అతనిని పిలిచి విద్యార్థుల సమక్షంలో ఫోన్‌ను అందజేశారు. వడ్రంగి పని ముగించుకుని మధ్యాహ్నం భోజనానికి హడావిడిగా ఇంటికి వెళుతూ సెల్‌ఫోన్‌ను జారవిడుచుకున్నానని ఆయన చెప్పారు. తన ఫోన్‌ను అప్పగించిన విద్యార్థులు, ఉపాధ్యాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల నిజాయతీని అభినందించారు.

గణనాథుడికి ఘనంగా పూజలు



దొడ్డనపూడిలో వినాయకుని భారీ విగ్రహం

ఉండి: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.నాల్గవరోజు మంగళవారం ఉండి నిమ్మలపేటలో వేంచేసిన బొజ్జగణపయ్యకు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉండి, మహదేవపట్నం, యండగండి, కోలమూరు, ఎన్నార్పీ అగ్రహారం, చెరుకువాడలో వినాయకచవితి పండుగ కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. స్థానిక భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఉత్సాహంగా గణపతి నిమజ్జనాలు

కాళ్ల: గణపతి నవరాత్రి వేడుకలు మండలంలో ఘనంగా కొనసాగుతున్నాయి. 4వ రోజైన మంగళవారం పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహాలు భారీ ఊరేగింపు నడుమ, బాణసంచా కాల్పులతో, తీన్మార్ వాయిద్యాలతో యువకులు ఉత్సాహంగా నిమజ్జనోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పలు చోట్ల ఆలయాల వద్ద భారీ అన్నసమారధనలు నిర్వహించారు. దొడ్డనపూడిలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన భారీ వినాయకుని విగ్రహం అందరినీ ఆకర్షిస్తోంది. స్వామి వారికి నిత్య పూజలు చేసి తీర్థప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా కాళ్ల లంక రోడ్డు సెంటర్లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద కడలి దుర్గాప్రదీప్ ఆధ్వర్యంలో 25 రకాల పిండి వంటలతో సుమారు 3 వేల మందికి భారీ అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ నిమ్మల శ్రీనివాస్

భీమవరం అర్బన్: పారదర్శక పాలన అందించేందుకు ప్రజలకు, ప్రభుత్వానికి సమాచారం హక్కు చట్టం ఉందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వివిధ శాఖల అధికారులు, ప్రజలకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఏదేని శాఖల్లో సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ విషయంపై సదరు అధికారి పట్టించుకోకపోతే సమాచార హక్కు చట్టం ద్వారా 15 రోజుల్లో జవాబుదారీతనాన్ని పొందవచ్చని అన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యలను పరిష్కరించకపోతే సమాచార హక్కు చట్టం ద్వారా వివరణ కోరే హక్కు చట్టం కల్పిస్తుందన్నారు. అధికారులు ప్రలోభాలకు లొంగకుండా సమాచార చట్టం వజ్రాయుధంలా పనిచేస్తుందన్నారు. ఈ చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్, బంటుమిల్లి కృష్ణారావు, పశువైద్యాధికారి డాక్టర్ మౌర్య, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

డీఆర్‌యూసీ మెంబర్ కుమార్‌కు అభినందన

పాలకొల్లు అర్బన్: డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యులుగా రెండోసారి నియమితులైన హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జక్కంపూడి కుమార్‌ను పట్టణ హోటల్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సత్కరించారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల ప్రజలకు రైల్వే సౌకర్యాలు మరింత మెరుగు పరిచేలా పని చేయాలని కోరారు. కుమార్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. హోటల్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక పెదఅమిరానికి చెందిన మహేశ్వరి గ్రూప్స్ అండ్ మహేశ్వరి ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ కలిదిండి మురళీ కృష్ణంరాజు విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న నరేష్ ఎగ్జిక్యూటివ్ బాయ్స్ హాస్టల్ యజమాని కొప్పినేని నరేష్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి రూ.50 వేల చెక్కును అందించారు. వరద బాధితులకు తమ వంతు బాధ్యతగా విరాళాన్ని అందించినట్లు నరేష్ తెలిపారు.

పునరావాస కేంద్రంలో భోజన వసతి

ఆకివీడు: కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆర్థిక సహకారంతో స్థానిక జెడ్పీ స్కూల్లోని పునరావాస బాధితులకు భోజన వసతిని కల్పించినట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోరం రామ్మూర్తి చెప్పారు. పట్టణంలోని వీరమల్లు కాలనీ ముంపునకు గురికావడంతో బాధితులకు జెడ్పీ స్కూల్లో పునరావాసం కల్పించారు. పునరావాస కేంద్రాన్ని సోమవారం మంత్రి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకటించిన విధంగా సోమవారం బాధితులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం కల్పించినట్లు రామ్మూర్తి చెప్పారు. బీజేపీ మండల అధ్యక్షుడు కట్రెడ్డి ఏడుకొండలు, జిల్లా కార్యదర్శి ముదునూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి



సీపీఐ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

భీమవరం: విరివిగా విరాళాలిచ్చి వరదల బాధితులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం పట్టణంలో నిధి సేకరణ చేపట్టారు. బుడమేరు వాగుకు గండ్లుపడి వందేళ్ల కాలంలో కనీవినీ ఎరుగని రీతిలో విజయవాడను వరదలు ముంచెత్తాయని భీమారావు అన్నారు. వరదల కారణంగా సర్వసాన్ని కోల్పోయి కట్టుబట్టలతో దిక్కుతోచని స్థితిలో బాధితులు సాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, ఎం లక్ష్మీపతి, కోన గొల్లయ్య, కొడవర్తి రమేష్, దొమ్మేటి నాగరాజు, ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పేషెంట్ల కోసం జుట్టు దానం

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన యువకుడు ఏఎన్‌పీకే ఫౌండేషన్ అధ్యక్షుడు చెన్నంశెట్టి గోవర్ధన్ వినూత్నమైన దానం చేసి ప్రజల్లో గుర్తింపు పొందాడు. గోవర్ధన్ వినూత్నంగా జుట్టు దానం చేశాడు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ క్యాన్సర్ పేషెంట్లకు కీమోథెరపీ చేస్తుంటారని ఆ సందర్భంలో పేషెంట్‌కు జుట్టు ఊడిపోతుందని తెలిపారు. ఆ సమయంలో కొందరు మహిళలు నలుగురిలో తిరగడానికి ఇబ్బంది పడుతుంటారని అటువంటి మహిళలు విగ్ ఏర్పాటు చేసుకోవడానికి వేలల్లో ఖర్చవుతుందని తెలిపారు. ఒక విగ్‌కు సుమారు రూ. 20 వేల నుంచి రూ. 70 వేల వరకూ ఖర్చవుతుందన్నారు. అంత ఖర్చు పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని వారి కోసం తనవంతు సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో 15 నెలలుగా హెయిర్ పెంచానని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎయిర్ డొనేషన్ సంస్థ సభ్యులు పేషెంట్లకు ఉచితంగా విగ్గులు అందజేస్తున్నారని తెలిసి తన జుట్టు ఆ సంస్థకు అందజేశానని తెలిపారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

ఉండి: రోడ్డుపై వెళుతున్న వ్యక్తిపై వినాయక నిమజ్జన సమయంలో మరోవ్యక్తి దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి చిక్కాల వీరన్ననగర్‌కు చెందిన రాపాక సాంబశివ అనే వ్యక్తి ఉండిలోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. ఈ నెల 9వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో దుకాణం మూసివేసి కొత్తపేటలో ఉంటున్న తన యజమాని బాబుకు తాళాలు ఇచ్చి తిరిగివస్తున్న సమయంలో పోస్టాఫీసుకు సమీపంలో వినాయక నిమజ్జన కార్యక్రమం జరగడంతో సాంబశివ తన ద్విచక్రవాహనంపై జనానికి పక్కగా వెళుతుండగా అక్కడే వున్న సిరికి దుర్గారావు అనే వ్యక్తి ఇటుగా వెళ్లకూడదంటూ దుర్భాషలాడి బైక్‌పై ఉన్న వ్యక్తిని కిందకు లాగి దాడి చేశాడు. దీంతో సాంబశివ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న అతని యజమాని బాధితుడిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫెర్రీ ఆదాయం మున్సిపాలిటీకి అందించాలి

నరసాపురం: మాధవాయిపాలెం ఫెర్రీ ఆదాయంలో 25 శాతం వాటా మున్సిపాలిటీకి చెందేలా చర్యలు చేపట్టాలని నరసాపురం మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రేవు ఆదాయం మొత్తం మండల పరిషత్‌కు వెళ్తుందని ఆర్డీఓకు వివరించారు. కౌన్సిలర్లు కామన బుజ్జి, బర్రి జయరాజు, కావలి నాని, కేసరి గంగరాజు, సఖినేటిపల్లి సురేష్, వంగా శ్రీకాంత్ కన్నా, పాలూరి బాబ్జి పాల్గొన్నారు.